మత్తు.. యువత చిత్తు

హాస్టళ్లపై తగ్గిన పోలీసుల నజర్

పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ మత్తులో జోగుతున్న యువకులు

డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడుతున్న వైనం

హాస్టళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు

ఇటీవల ఉపాధ్యాయుడి దారుణ హత్య

అమీర్‌పేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ హాస్టళ్లలోని కొంతమంది యువకులు డ్రగ్స్, గంజాయి మత్తులో ఇష్టారీతిన ప్రవర్తిస్తూ స్థానికులను భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు దృష్టి సారించకపోవడంతో వారి వ్యవహారం ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా సాగుతోంది. ఇదేంటని ప్రశ్నిస్తే చంపడానికి కూడా వెనకాడని పరిస్థితి. ఎస్‌ఆర్ నగర్, బల్కంపేట, అమీర్‌పేటలో ఉన్న హాస్టళ్లపై స్థానిక పోలీసులు పెద్దగా నజర్ పెట్టడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. హాస్టళ్లలో సగానికిపైగా వాటిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నిర్వాహకులు విద్యార్థుల నుంచి నెలనెల డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప, హాస్టల్ గదుల్లో ఏం జరుగుతుందనే అనే దానిపై మాత్రం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు యువకులు తాగి వచ్చి ప్రతిరోజూ గొడవ చేస్తున్నాడని అమీర్‌పేటలో హనుమ యోగా లక్ష్మీ అన్నపూర్ణ బాయిస్ హాస్టల్ నిర్వాహకుడికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కర్నూల్‌కు చెందిన వెంకటరమణ ప్రశ్నించడంతో ఏలూరు వాసి గణేశ్, గడ్డం గీసుకునే కత్తితో విచక్షణ రహితంగా దాడిచేసి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే.

డ్రగ్స్‌తో దొరికిన యువకులు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా పోలీసులు చేసిన తనిఖీల్లో గంజాయి, డ్రగ్స్‌తో ఆరుగురు యువకులు పట్టుపడ్డారు. అలాగే ఇటీవల ఎస్‌ఆర్ నగర్ బస్టాప్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ బ్యూరో అధికారులు రంగంలోకి దిగి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 16 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కొంతమంది యువకులు రాత్రి, పగలు తేడా లేకుండా గంజాయి సేవిస్తూ అల్లర్లకు పాల్పడుతున్నారు. బల్కంపేట శ్మశానవాటిక, బాపునగర్, ఈఎస్‌ఐ, ఎస్‌ఆర్‌నగర్, పోలీస్ స్టేషన్ వెనుక వీధుల్లో రాత్రివేళ



యథేచ్ఛగా గంజాయి, హ్యాష్ ఆయిల్ సేవిస్తున్నారు. పోలీస్ పెట్రోలింగ్ అంతంతా మాత్రంగా నిర్వహిస్తుండడంతో బల్కంపేట శ్మశాన వాటిక వద్ద మత్తులో ఊగుతూ ప్రకృతి చికిత్సాలయం వద్ద ఎంఎంటీస్ రైలు దిగి వస్తున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తూ బయబ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బంజారాహిల్స్ పబ్‌లో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు పట్టుబడిన వారిలో కొంతమంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఆర్‌నగర్‌లోని వెంకట్ అనే హాస్టల్లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో శుక్రవారం తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున డ్రగ్స్ స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్ట్ చేశారు. ఇకనైన పోలీసులు డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నియంతలా కోట నీలిమ ధోరణి

పార్టీకి నష్టం చేస్తుందన్న పలువురు కాంగ్రెస్ నేతలు



సమావేశంలో పార్టీ స్థానిక నేతలు

బేగంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ధోరణితో సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని పార్టీ సీనియర్ నాయకులు సలీంఖాన్, నాగేందర్ యాదవ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వైఖరిని నిరసిస్తూ పలువురు నేతలతో కలిసి బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ పని చేసిన వారికి తగిన ప్రాధాన్యం ఉండటం లేదని వాపోయారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఆమె వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నియంతలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి పార్టీ కార్యాలయానికి వెళ్తే అక్కడ అంతా ఢిల్లీ వారే ఉంటారని, వారు ప్రజల సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నీలిమ పూర్తిగా విఫలమయ్యారన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ విషయం బయటపడిందన్నారు. ఇప్పటికైనా పార్టీ అగ్రనేతలు సమస్యను పరిష్కరించాలన్నారు. ఇది ఇలాగే కొనసాగితే సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పలు డివిజన్లకు చెందిన నాయకులు కేకే, అబ్దుల్ వాహిద్, మహ్మద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నాయకులు

బోరబండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బోరబండ నుంచి సిటీ నలు మూలలకు ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రజా రవాణ వ్యవస్థను మెరుగు పరచాలని జూబ్లీ హిల్స్ జోన్ సీపీఎం నాయకులు టి.సాయిశేషగిరిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బోరబండ బస్టాప్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత రద్దు చేసిన బస్ నంబర్ 45ఎఫ్‌ను పునరుద్ధరించాలన్నారు. అలాగే 113వై/ఎఫ్ బస్సు సర్వీసును పెంచాలన్నారు. ప్రయాణికుల రద్దీ అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచాలన్నారు. ప్రయాణికుల నుంచి సేకరించిన సంతకాలను ఆర్టీసీ చైర్మన్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాపర్తి అశోక్, జె.స్వామి, నరసింహ, బాలు, సోమేశ్, కృష్ణ, సోమునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లకు ఉద్యోగులతో సమాన వేతనాలివ్వాలి



ట్రాన్స్‌కో సీఎండీకి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాంబో నాగరాజు డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రాస్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పలు విభాగాల్లో పనిచేస్తున్న 6,500 మంది కార్మికులను రెగ్యులరైజ్ చేయడానికి, అలాగే పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి అన్ని ట్రేడ్ యూనియన్లు, అసోషియేషన్లతో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. ఆర్టిజన్ల సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఒకే సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు, ఉద్యోగులకు ఒకే రూల్స్ అమలు చేయాలన్నారు. ఆర్టిజన్లకు ఉద్యోగులతో పాటు ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగం సంతోష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసశర్మ



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రస్తుత ఈవో లావణ్య

బంజారాహిల్స్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన ఈవోగా శ్రీనివాసశర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఈవో లావణ్య కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ కాగా అక్కడి నుంచి శ్రీనివాసశర్మ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పాత ఈవోకు వీడ్కోలు కొత్త ఈవోకు వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆలయ అభివృద్ధికి నిరంతరం శ్రమించినట్లు చెప్పారు. ఆలయానికి రూ.2 కోట్ల ఆదాయాన్ని సమకూర్చి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ఆమె వెల్లడించారు. శ్రీనివాసశర్మ మాట్లాడుతూ అర్చకులను, సిబ్బందిని కలుపుకుపోతూ భక్తులకు అనువైన వాతావరణం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చెస్ బాక్సింగ్‌లో రాష్ట్రానికి 10 పతకాలు



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్జాతీయ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు 10 పతకాలు సాధించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో కోచ్ ప్రతిభ మాట్లాడుతూ ప్రభుత్వం చెస్ బాక్సింగ్‌ను ప్రోత్సహించాలని కోరారు. కోల్‌కతాలో గత నెల 26 నుంచి 31 తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో మాస్టర్ పోచారం రుషాంక్ రెడ్డి రెండు స్వర్ణాలు, సీనియర్ కేటగిరీలో విజయ్ రాఘవేంద్ర రావు రెండు పసిడి పతకాలు, సీనియర్ మహిళల విభాగంలో టి.ప్రతిభ ఐదు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించారని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో జపాన్, రష్యా, కెనడాతో పాటు పలు దేశాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్ గణపతి నమూనా విడుదల

ఖైరతాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ బడా గణపతి విగ్రహ నమూనాను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం రాత్రి విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలసి మండప ప్రాంగణానికి చేరుకున్నారు. కాగా, అంతకుముందు విగ్రహ నమూనాను విడుదల చేస్తామని ఉత్సవ కమిటీ ప్రకటించి ఎమ్మెల్యే కోసం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి వరకు మీడియాతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. రాత్రి అయినా రాకపోవడంతో మీడియా ప్రతినిధులతో పాటు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో బిజీగా ఉండడంతో ఆయన రాత్రి వరకు రాలేకపోయనట్లు తెలుస్తోంది. కాగా, రాత్రి సమయానికి గణపతి నమూనా సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో ఉత్సవ కమిటీ ప్రతినిధులు అవాక్కయ్యారు. రెండు గ్రూపుల విభేదాలే ఈ ఆలస్యానికి కారణమంటూ మరికొందరు గుసగుసలాడుతున్నారు.



ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అమరావతిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మండూరి సాంబశివరావు -బేగంపేట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి):



ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో బేగంపేటలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, సుదర్శనబాబు, వల్లూరి నాగేష్, సి. సత్తయ్య తదితరులు - బేగంపేట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి):

వైభవంగా ఏవియేటర్స్ మీట్




మీట్‌లో కెప్టెన్ అనిల్ కుమార్, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విమానయానరంగంలో విశేష సేవలందించిన ఏవియేటర్లతో ఏర్పడిన హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏవియేటర్స్ సమావేశం గురువారం రాత్రి మాదాపూర్‌లోని ఓ సంస్థ షో రూమ్‌లో జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ ఏవియేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కెప్టెన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏవియేషన్ రంగంలో విశేష కృషి చేసిన వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్‌లో 600 మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. 18 ఏళ్ల క్రితం తొలిసారిగా ఏవియేటర్స్ మీట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు 250 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు.

ఉద్యోగంలో ఉన్నత స్థానం దక్కడం లేదని యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చేస్తున్న ఉద్యోగంలో ఉన్నత స్థానం దక్కడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా రొంపిచెర్ల మండలం, విప్పార గ్రామానికి చెందిన ఆవుల అప్పారావు కుమారుడు ఆవుల మస్తాన్‌రావు (24) నగరంలోని ఓ కాల్‌సెంటర్‌లో పనిచేస్తూ ఎస్‌ఆర్ నగర్‌లోని శ్రీ సాయి అంకిత్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. తాను పనిచేస్తున్న సంస్థలో ఉన్నత స్థానం కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గత నెల 31న విషం తాగి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. విషయాన్ని గదిలో ఉండే సహచరులు గుర్తించి అమీర్‌పేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేబీఆర్ పార్క్‌లో గేట్ నెంబర్-5 వద్ద ఫౌంటెయిన్ రాక్ విద్యుదీకరణను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.. జోనల్ కమిషనర్ అనురాగ్, కార్పొరేటర్ వెంకటేష్‌లతో కలిసి ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి)

లైబ్రరీలో వ్యాసరచన పోటీలు

సనత్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సనత్‌నగర్ లైబ్రరీలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెయిన్‌బో, నీనా స్కూల్, జైభారతి, విద్యాంజలి, రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ హరిబాబు, సత్యనారాయణ, అనంతరెడ్డి, ప్రసాద్, రాజేందర్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ పీజీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 2024-25కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024లో స్కోరు సాధించిన అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సుల్లో అడ్మిషన్ కోసం ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మొత్తం 442 సీట్ల భర్తీ నిమిత్తం ఈనెల 22నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, సెప్టెంబర్ 2నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

పనిలో చేరిన పది రోజులకే చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిలో చేరిన ఓ యువకుడు దొంగతనం చేసి పారిపోయాడు. ఈ సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన చరణ్‌సాయి అమీర్‌పేట ప్రాంతంలో ఉంటూ జూలై 20న సారథి స్టూడియో ఎదురుగా ఉన్న సూపర్‌గ్యాస్ కంపెనీలో గ్యాస్ ఫిల్లింగ్ విధుల్లో చేరాడు. 31న అతను రెండో షిఫ్ట్‌లో డ్యూటీకి వచ్చి రాత్రి ఎవరికీ చెప్పకుండా కంపెనీకి సంబంధించిన డబ్బు రూ.33,618 తీసుకుని పరారయ్యాడు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సనత్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ శివశంకర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహం లభ్యమైంది. కాలనీలోని ఐరన్ షీట్ బైండింగ్ వర్క్‌షాప్ ఎదురుగా ఓ వ్యక్తి చలనం లేకుండా పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే సనత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి అరెస్ట్

మారణాయుధం డాగర్ స్వాధీనం

అమీర్‌పేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పలహారం బండి ఊరేగింపులో మారణాయుధం డాగర్ (పొడవాటి కత్తి)తో అనుమానాస్పందంగా తిరుగుతున్న ఇద్దరిని ఎస్‌ఆర్ నగర్ పోలీసులు అరెస్టు చేసారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం బల్కంపేట సమీపంలోని ప్రశాంత్‌కాలనీ నుంచి బోనాల ఉత్సవంలో భాగంగా పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ఎస్‌ఆర్ నగర్‌లోని వేంకటేశ్వర ఆలయం వద్దకు చేరుకున్న తర్వాత బందోబస్తులో ఉన్న పోలీసులకు అనుమానంగా ఇద్దరు యువకులు కనిపించారు. బేగంపేట, మయూరి మార్గ్‌కు చెందిన భీమ్‌సింగ్ సురేశ్(19), బీజేఆర్ నగర్‌కు చెందిన రామేశ్వరం రామ్(20)లను పోలీసులు సోదాలు చేసారు. సురేశ్ వద్ద 9.5 అంగుళాల పొడవున్న డాగర్ దొరికింది. దీంతో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

పాములకు ఆవాసంగా శిథిల ఇల్లు

సమీపంలోనే పాఠశాల.. భయాందోళనలో విద్యార్థులు



పాడుపడిన ఇల్లు

బేగంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఓ ఇల్లు శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత కూలిపోయింది. దీంతో ఆ ఇంటిని పాములు ఆవాసంగా మార్చుకున్నాయి. రెండు నెలలుగా నిత్యం ఇక్కడ నుంచి పాములు ఆ ఇంట్లో నుంచి బయటకు వస్తుండడంతో స్థానికులు భయంతో హడలిపోతున్నారు. ఈ ఇంటికి దగ్గరల్లోనే ప్రభుత్వ పాఠశాల ఉండడం, పిల్లలు నిత్యం ఇటు వైపు రాకపోకలు సాగిస్తుండడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా శుక్రవారం ఆ ఇంట్లో నుంచి రెండు పాములు బయటకు రావడంతో బస్తీ వాసి సలీంఖాన్ పాములు పట్టే వారికి ఫోన్ చేశాడు. వెంటనే వారు వచ్చి బయటకు వచ్చిన రెండు పాములను పట్టుకున్నారు. అలాగే వారు ఆ ఇంటిని పరిశీలించి ఇంట్లో పాములు గుడ్లు పెట్టాయని, జాగ్రత్తగా ఉండాలని స్థానికులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, బస్తీ అధ్యక్షుడు సలీంఖాన్ మాట్లాడుతూ గతంలోనే ఈ విషయం ఇంటి యజమానికి చెప్పినా పట్టించుకోలేదని, ఇటీవల జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

దండుమారమ్మ బోనాల జాతరకు రండి

● మంత్రి పొన్నంకు ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోనాల జాతరకు ఆహ్వానిస్తున్న లక్ష్మణ్‌యాదవ్, ప్రమోద్‌కుమార్

సికింద్రాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు జంటనగరాల్లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి దండుమారమ్మ బోనాల జాతరకు రావాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ కాంగ్రెస్ కార్యదర్శి బీ.ఎ.ప్రమోద్‌కుమార్ ఆహ్వానించారు. వచ్చే నెల 4వ తేదీన దండుమారమ్మ బోనాల జాతర జరగనున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్‌తో పాటు ఆయన కలిశారు. దండు మారమ్మ ఆలయ చరిత్ర, అమ్మవారి ప్రాశస్త్యం, ప్రతి ఏడాది బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగే తీరు గురించి మంత్రికి వివరించారు. కంటోన్మెంట్‌తోపాటు జంటనగరాలు, శివార్ల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తారని, జాతరలో భాగంగా తమ ఆధ్వర్యంలో కనుల పండువగా ఫలహార బండి ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో కళాప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

బోయిన్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు బోయిన్‌పల్లి సెక్షన్ విద్యుత్ డివిజన్ డీఈ భిక్షపతి తెలిపారు. బోయిన్‌పల్లి సెక్షన్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని కడక్‌పుర, నేతాజీనగర్, కృష్ణారెడ్డినగర్, కంసరిబజార్, పెన్షన్ లైన్‌లలో బోయిన్‌పల్లి డీఈ భిక్షపతి సమస్యలపై స్థానికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ భిక్షపతి మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను ప్రాధాన్యతను బట్టి పరిష్కరిస్తామని అన్నారు. వర్షాకాలంలో విద్యుత్ వైర్ల స్తంభాలు ఉన్న నివాసితులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. సమావేశంలో ఏడీఈ కృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పాములకు ఆవాసంగా శిథిల ఇల్లు

సమీపంలోనే పాఠశాల.. భయాందోళనలో విద్యార్థులు



పాడుపడిన ఇల్లు

బేగంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఓ ఇల్లు శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత కూలిపోయింది. దీంతో ఆ ఇంటిని పాములు ఆవాసంగా మార్చుకున్నాయి. రెండు నెలలుగా నిత్యం ఇక్కడ నుంచి పాములు ఆ ఇంట్లో నుంచి బయటకు వస్తుండడంతో స్థానికులు భయంతో హడలిపోతున్నారు. ఈ ఇంటికి దగ్గరల్లోనే ప్రభుత్వ పాఠశాల ఉండడం, పిల్లలు నిత్యం ఇటు వైపు రాకపోకలు సాగిస్తుండడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా శుక్రవారం ఆ ఇంట్లో నుంచి రెండు పాములు బయటకు రావడంతో బస్తీ వాసి సలీంఖాన్ పాములు పట్టే వారికి ఫోన్ చేశాడు. వెంటనే వారు వచ్చి బయటకు వచ్చిన రెండు పాములను పట్టుకున్నారు. అలాగే వారు ఆ ఇంటిని పరిశీలించి ఇంట్లో పాములు గుడ్లు పెట్టాయని, జాగ్రత్తగా ఉండాలని స్థానికులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, బస్తీ అధ్యక్షుడు సలీంఖాన్ మాట్లాడుతూ గతంలోనే ఈ విషయం ఇంటి యజమానికి చెప్పినా పట్టించుకోలేదని, ఇటీవల జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులను వేగవంతం చేయండి

అల్వాల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వరదముంపు నివారణ, రోడ్లపై వరద రాకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్వాల్ సర్కిల్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. సమగ్ర రోడ్ల నిర్వాహణ కార్యక్రమం(సీఆర్ఎంపీ) కింద రోడ్ల నిర్వాహణ పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్‌లోని వివిధ రోడ్లను, నాలాలను, పరిశీలించారు. ఈ ప్రాంతాలలో నెలకొన్న రోడ్లమరమ్మతులు, వరద ముంపు సమస్యలను అధికారులు, స్థానికులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. జోనల్ కమిషనర్ రోడ్ల మరమ్మతులు, వరదముంపు నివారణకు పైప్‌లైన్‌ల కోసం ప్రతిపాదనలు తయారుచేసి వెంటనే పంపిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. అధికారులు దాదాపుగా రూ.5 కోట్లతో కూడిన ప్రతిపాదనలు తయారుచేసి జోనల్ కార్యాలయానికి పంపించారు. జోనల్ కమిషనర్‌తో కలిసి పర్యటించిన వారిలో డీఈలు కార్తీక్, రఘు, ఏఈలు అరుణ్, రవళి, లక్ష్మీ, ఏఎంహెచ్‌వో మంజుల ఉన్నారు.

నియంతలా కోట నీలిమ ధోరణి

పార్టీకి నష్టం చేస్తుందన్న పలువురు కాంగ్రెస్ నేతలు

బేగంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ధోరణితో సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని పార్టీ సీనియర్ నాయకులు సలీంఖాన్, నాగేందర్ యాదవ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వైఖరిని నిరసిస్తూ పలువురు నేతలతో కలిసి బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యం ఉండటం లేదని వాపోయారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆమె వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నియంతలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి పార్టీ కార్యాలయానికి వెళ్తే అక్కడ అంతా ఢిల్లీవారే ఉంటారని, వారు ప్రజల సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నీలిమ పూర్తిగా విఫలమయ్యారన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ విషయం బయటపడిందన్నారు. ఇప్పటికైనా పార్టీ అగ్రనేతలు సమస్యను పరిష్కరించాలన్నారు. ఇది ఇలాగే కొనసాగితే సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పలు డివిజన్లకు చెందిన నాయకులు కేకే, అబ్దుల్ వాహిద్ , మహ్మద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ పీజీ అడ్మిషన్లకు దరఖాస్తు ఆహ్వానం

● ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్, సెప్టెంబర్ 2 నుంచి తరగతులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 2024-25కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024లో స్కోరు సాధించిన అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సులో అడ్మిషన్ కోసం 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మొత్తం 442 సీట్ల భర్తీ నిమిత్తం ఈనెల 22 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, సెప్టెంబర్ 2నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.



సీతాఫల్‌మండి మేడిబావిలో ముస్తాబైన పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయం



బోనాలకు రావాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న చైర్మన్ కళాప్రకాశ్





ఆలయంలో కొలువుదీరిన పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

బోనాలకు ఆలయాల ముస్తాబు

బౌద్ధనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మేడిబావిలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢ బోనాలు ఘనంగా జరగనున్నాయి. పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సీతాఫల్‌మండి, మేడిబావి, ఇందిరానగర్ కాలనీ, వారాసిగూడ తదితర ప్రాంతాలవారు ఈ బోనాల వేడుకల్లో పాల్గొననున్నారు. పదివేల మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఆది, సోమవారం జరిగే బోనాల వేడుకల్లో ఇరవై ఫలహారబండ్లు, తొట్టెల ఊరేగింపుతో పాటు రంగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కేంద్రమంతి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్, సనత్‌నగర్ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహిళలకు అమ్మవార్లకు వడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు. మేడిబావి బోనాలు పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.



1984లో వెలసిన ఉప్పలమ్మ ఆలయం

భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు : చైర్మన్ కళాప్రకాశ్

మేడిబావిలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో జరిగే బోనాల వేడుకలలో పాల్గొనే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆలయచైర్మన్ పరికిబండ కళాప్రకాశ్ తెలిపారు. మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి బోనాలకు రావాలని ఆహ్వానపత్రికను అందజేశామని తెలిపారు.



ప్రస్తుతం ఉప్పలమ్మ విగ్రహం

ఏటా కొనసాగుతున్న బోనాల ఉత్సవాలు

సికింద్రాబాద్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తుకారాంగేట్ మరాఠబస్తీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు హయంలో మరాఠబస్తీలో రెండు వందల కుటుంబాలకు ఇళ్లు కట్టించిన ఘనత చంద్రబాబునాయుడిదేనంటున్నారు బస్తీవాసులు, అప్పట్లో టీడీపీ హయంలో మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా ఈ మరాఠబస్తీని సందర్శించి ఊరు గాని ఊర్ల నుంచి వచ్చిన మరాఠ బస్తీవాసులకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని ఇళ్లు నిర్మించారు. 1984లో ఈ బస్తీలో ఒక చిన్న బండరాయితో ఉప్పలమ్మ దేవత వెలుగులోకి రావడంతో మరాఠబస్తీ ప్రజలు దేవతను కొలుస్తూ ప్రతి ఏటా బోనాల ఉత్సవాలు జరుపుకుంటున్నారు. ఈనెల 4న బస్తీలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దాదాపు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆది, సోమవారాల్లో ఇక్కడ కనులపండువగా మరాఠబస్తీ ప్రజలు పండుగను ఘనంగా జరుపుకుంటారు.

మా బస్తీ నారాచంద్రబాబు పుణ్యమే

సనాదన్ (బస్తీ అధ్యక్షుడు)



రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో రాష్ట్రాలు విడిచిపెట్టి పొట్టకూటి కోసం ముప్పై ఏళ్ల క్రితం బతుకు దెరువు కోసం తుకారాం గేట్ ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద గుడిసెలు వేసుకుని ఉన్నాం. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో ఇక్కడ ముందుగా ఐదు ఆరు గుడిసెలు వేసుకుని నివసించాం. ఆ తరువాత రెండు వందల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాం. ఆరోజున చంద్రబాబు తమకు ఇళ్లు ఇవ్వకపోతే గుడిసెల్లో బతికేవాళ్లం. ప్రతి ఏటా నిర్వహించే ఉప్పలమ్మ విగ్రహం వద్ద బోనాల ఉత్సవాలు జరుపుకుంటున్నాం.

ఏవియేటర్స్ మీట్



ఏవియేటర్స్ మీట్‌లో కెప్టెన్ అనిల్ కుమార్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విమానయాన రంగంలో విశేష సేవలందించిన ఏవియేటర్లతో ఏర్పడిన హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏవియేటర్స్ సమావేశం గురువారం రాత్రి మాదాపూర్‌లోని ఓ సంస్థ షో రూమ్‌లో జరిగింది. దాదాపు 250 మంది ఏవియేటర్స్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో 50 ఏళ్ల క్రితం విమానయాన రంగంలో సేవలందించిన వ్యక్తులు కూడా పాల్గొనడం విశేషం. ఏవియేషన్ రంగంలో నూతనంగా కెరీర్ ప్రారంభించిన వారికి తమ అనుభవాలను చెప్పిన వారు, ఈ రంగంలో ఏ విధంగా ఉండాలో తగు సూచనలు కూడా చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఏవియేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కెప్టెన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏవియేషన్ రంగంలో విశేష కృషి చేసిన వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్‌లో 600 మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. 18 ఏళ్ల క్రితం తొలిసారిగా ఏవియేటర్స్ మీట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు 250 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవియేషన్ హిస్టారియన్ అనురాధరెడ్డి, అసోసియేషన్ సహ వ్యవస్థాపకులు కెప్టెన్ మార్క్ నీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లైవ్ మ్యూజిక్, మ్యాజిక్ షో వంటివి ఆకట్టుకున్నాయి.

అన్ని యూనివర్సిటీల్లో వీసీలను నియమించాలి

● ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన

● రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఓయూలోని ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు

తార్నాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్‌లను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ విద్యార్థి నాయకులు శుక్రవారం ఓయూలోని ప్రధాన రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో వీసీల పదవీకాలం పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్ని వర్సిటీల్లో వీసీలను నియమించడంతో పాటు, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులు పృథ్వీ, తేజ, జీవన్, శ్రీహరి, కమల్, సురేష్, సుమన్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ ప్రొ. కాశీం తదితరులు

అత్యున్నత న్యాయస్థానం తీర్పు చరిత్రాత్మకం

● ఓయూ ప్రొ.కాశీం

● హర్షం వ్యక్తం చేసిన మాదిగ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

తార్నాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని ఓయూ ప్రొ.కాశీం అన్నారు. ఈమేరకు శుక్రవారం ఓయూలోని మాదిగ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ ప్రొ.కాశీం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని, ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా చేసిన ఎస్సీ వర్గీకరణ పోరాటం రుజువు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను పాటిస్తూ వెంటనే విద్యాసంస్థల్లో, ఉద్యోగాల భర్తీల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. సుప్రింకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణకు సంబంధించిన రిజర్వేషన్లను తక్షణమే అమలు చేస్తామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకువస్తామని అసెంబ్లీలో ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ డీన్ ప్రొ.జి. మల్లేషం, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ చింత సాయిలు, ఓయూ చీఫ్ వార్డెన్ కొర్రముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

● ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకుల అరెస్టు

తార్నాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ విద్యార్థుల పట్ల కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు శుక్రవారం ఓయూలోని ఎన్‌సీసీ గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగాల పేరిట నిరుద్యోగ విద్యార్థులను నమ్మించి మోసం చేసిన రాహుల్‌గాంధీ తెలంగాణ యువతకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో ఎటువంటి స్పష్టమైన ప్రకటన లేదని, నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏమిటో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చనిపక్షంలో, ఆ పార్టీని గద్దె దించుతామని ఘాటుగా హెచ్చరించారు.

రైల్వే స్టేషన్‌లో విద్యార్థి అదృశ్యం



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి రైలులో వచ్చి సికింద్రాబాద్‌లో దిగిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన శశిధర్‌రెడ్డి ఈనెల 30న గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైలులో వస్తుండగా 31న తెల్లవారుజామున తన సోదరుడు చాముండేశ్వర్ రెడ్డికి ఫోన్ చేసి చెప్పడంతో చాముండేశ్వర్ రెడ్డి తెల్లవారుఝామున శశిధర్ రెడ్డిని పికప్ చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. తీరా శశిధర్‌రెడ్డి ఎక్కడా కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేశాడు. ఇక లాభం లేదని చాముండేశ్వర్ రెడ్డి వెంటనే 1న సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు మిస్సింగ్ కింద ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రైల్వే స్టేషన్‌లో జేబు దొంగను పట్టుకున్న ఆర్పీఎఫ్ శక్తి రుద్రమ్మ టీం కానిస్టేబుళ్లు

రైల్వే స్టేషన్‌లో జేబు దొంగ అరెస్టు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న జేబు దొంగను సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ శక్తి రుద్రమ్మ ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ప్లాట్ ఫాం నెంబరు 2లో ఆగిఉన్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతున్న ప్రయాణికుల నుంచి ఓ దొంగ సెల్‌ఫోన్ కొట్టేశాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ శక్తి రుద్రమ్మ ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు విజయ, లావణ్య, సుధలు దొంగను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. నిందితుని నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగి వాహనాలు నడిపిన 9 మందికి శిక్ష విధించిన కోర్టు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తాగి వాహనాలు నడిపిన 9 మంది వాహనదారులకు నాంపల్లిలోని 7వ జ్యూడీషియల్ కోర్టు శుక్రవారం పలు శిక్షలను విధించింది. రక్తంలో ఆల్కహాల్ నమూనాలు 200కు పైగా ఉన్న వీరిలో ఇద్దరికి కోర్టు నడిచినంత సేపు (సాయంత్రం వరకు) కోర్టు ఆవరణలో నిల్చుని ఉండేలా, ముగ్గురికి 2 రోజుల జైలు శిక్షతో పటు 2100 రూపాయల నగదు జరిమాన, రెండవ సారి పట్టుబడ్డ ముగ్గురికి 4 రోజుల జైలు శిక్షతో పాటు 3300 రూపాయల నగదు జరిమానను విధించగా మూడవ సారి పట్టుబడ్డ వ్యక్తికి 7 రోజులు జైలు శిక్షతో పాటు 3300 రూపాయల నగదు జరిమానను కూడా విధించింది.

బాలుడితో కలిసి తల్లి అదృశ్యం



నేరేడ్‌మెట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బాలుడితో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబునాయుడు కాలనీలో నివాసం ఉండే కె.అంజలి తన మూడేళ్ల కుమారుడితో కలిసి గత నెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఈ విధంగా ఇంటి నుంచి వెళ్లిన ఆమె నాలుగైదు సార్లు తిరిగి ఇంటికి వచ్చింది. అలాగే తిరిగి వస్తుందని ఎదురు చూసి తెలిసిన అన్ని చోట్ల వెతికిన తల్లీ కొడుకుల ఆచూకి లభించలేదు. గురువారం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

జాబ్ క్యాలెండర్ విడుదల హర్షణీయం

● ఓయూలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

● రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల నిరుద్యోగ విద్యార్థుల హర్షం



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకుంటున్న నిరుద్యోగ విద్యార్థులు

తార్నాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడాన్ని హర్షిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ విద్యార్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నిరుద్యోగ విద్యార్థులు మిఠాయిలు పంచుకుని పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. దీంతో ఓయూ ఆర్ట్స్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి ఎప్పటికప్పుడు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఎటువంటి ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ విద్యార్థులు తీవ్ర నిరాశ నిస్పృహలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నిరుద్యోగ విద్యార్థుల్లో ఆశలు చిగురించాయని, విద్యార్థులు ఎటువంటి నిరాశ నిస్పృహలకు లోనుకావద్దని రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు విద్యార్థుల పక్షాన ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీను, వినయ్, సాయిగౌడ్, సుమన్ గౌడ్, సతీష్ యాదవ్, శేఖర్, గణేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి మానవతారాయ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి జాబ్ క్యాలెండర్‌లు ప్రకటించకుండా, నోటిఫికేషన్‌లు విడుదల చేయకుండా, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగ విద్యార్థులను పూర్తిగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే జాబ్ క్యాలెండర్ 30 వేల ఉద్యోగాల భర్తీతో పాటు, డీఎస్సీ, గ్రూప్ 1 వంటి పరీక్షలను ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నిర్వహించిందని స్పష్టం చేశారు. తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంపాల రాజేష్, ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు నోముల శేషు, సైదులు యాదవ్, కోట శ్రీనివాస్, పలిగొండ నర్సింహ్మా, సంపత్, భూషణ్, వెంపటి సూరి, గణేష్ పాల్గొన్నారు